సాక్షి కామారెడ్డి

శుక్రవారం ၊ 11 ၊ ఏప్రిల్ ၊ 2025



మెరుగైన సేవలు అందించాలి

ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర సిబ్బందికి సూచించారు.

- 8లో ▸



వడ్ల లారీ బోల్తా..

నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్‌పల్లి సమీపంలోని నిజాంసాగర్ కాలువలో ధాన్యం లారీ బోల్తా పడింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.9 /22.6

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

తహసీల్దార్‌కు వేధింపులు?

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలోని ఓ మండల తహసీల్దార్‌ను బుధవారం కొందరు ఇబ్బంది పెట్టినట్టు తెలిసింది. తమ మాట వినడం లేదంటూ సదరు వ్యక్తులు ఆ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి, పనుల విషయంలో తమకు సహకరించాలని ఒత్తిడికి గురిచేసినట్లు సమాచారం. ఈ విషయమై బాధితుడు సహచర తహసీల్దార్లతో కలిసి జిల్లా అధికారులకు మొరపెట్టుకున్నట్టు తెలిసింది. అయితే జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసే విషయంలో వెనకాముందవుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై జిల్లా అధికార యంత్రాంగంలో చర్చ నడుస్తోంది.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



కామారెడ్డి టౌన్‌: ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుపై ఇస్తున్న 5 శాతం రాయితీని కామారెడ్డి పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని 47వ వార్డుకు చెందిన రేవూరి భూమేశ్ రూ.3.56లక్షలు, రేవూరి నరేందర్ రూ.46వేల ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించగా, కమిషనర్ వారిని అభినందించారు. గృహ, గృహేతర యజమానులు స్పందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్‌వో రవిగోపాల్, ఆర్‌ఐ లలిత, మాజీ కౌన్సిలర్ పిట్ల వేణు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



నిజాంసాగర్(జుక్కల్): వేసవి కాలం ముగిసే వరకు గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో చందర్ నాయక్ సూచించారు. మహమ్మద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. అన్ని గ్రామ పంచాయతీలతోపాటు ప్రధాన చౌరస్తాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాజీవ్ యువవికాస్ దరఖాస్తులు స్వీకరిస్తూ వాటిని పరిశీలించాలన్నారు. ఆయన వెంట మహమ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల ఎంపీడీవోలు అనిత, గంగాధర్, కంప్యూటర్ ఆపరేటర్ విష్ణు తదితరులు ఉన్నారు.



ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న కామారెడ్డి మున్సిపాలిటీకి ప్రభుత్వశాఖలకు సంబంధించి పన్ను వసూలు సవాల్‌గా మారింది. చెల్లించాల్సిన పన్ను మొత్తాన్నికన్నా వడ్డీ ఎక్కువవుతున్నా సంబంధిత శాఖల నుంచి స్పందన కరువైంది. మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడం వరకే పరిమితమవుతున్నారు. కొన్ని శాఖలైతే ఏకంగా 15 ఏళ్ల నుంచి పన్ను చెల్లించడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

రూ.10కోట్లు చెల్లించలే..

- బల్దియాకు భారీ మొత్తంలో పన్ను బకాయిలు
- ఏళ్ల తరబడి చెల్లించని వైనం
- అసలుతో పోలిస్తే వడ్డీ ఎక్కువ

కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భవనాలకు సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. సంవత్సరాల తరబడి చెల్లించకపోవడంతో రూ.10 కోట్లకు పైగా బకాయిలున్నాయి. ప్రజల నుంచి గృహ, గృహేతర భవనాల ఆస్తి పన్నును ముక్కు పిండి వసూలు చేస్తున్న బల్దియా అధికారులకు ప్రభుత్వ శాఖల నుంచి బకాయిలను ఎలా రాబట్టుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఏటా పన్ను చెల్లించాలని సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేస్తున్నా స్పందించడం లేదు. కొన్ని ప్రభుత్వ శాఖలకు ఐదేళ్ల లోపు బకాయిలే ఉండగా, మరి కొన్ని శాఖలు 15 ఏళ్లుగా చెల్లించడం లేదు. మొండి బకాయిలు రాబట్టేందుకు ప్రభుత్వం వడ్డీలో 90శాతం రాయితీ కల్పించినా కొందరు ప్రైవేటు వారు తప్పితే ప్రభుత్వ శాఖల నుంచి స్పందన రావడం లేదు. కొన్ని ప్రభుత్వ శాఖలు మాత్రం ఎప్పటికప్పుడు పన్ను చెల్లిస్తున్నాయి. అయితే ప్రధాన శాఖల నుంచే స్పందన లేకపోవడం గమనార్హం.



రూ.3.31 కోట్ల బకాయి ఉన్న జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి

రూ.కోట్లలో వడ్డీ

జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఆస్తులకు సంబంధించి 84, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 14 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటికి సంబంధించి ఆస్తి పన్ను మొత్తంగా ఏటా దాదాపు రూ.75 లక్షల లోపు వస్తుంది. ఎప్పటికప్పుడు చెల్లిస్తే తక్కువే ఉంటుంది. ఏళ్ల తరబడి చెల్లించపోవడంతో పన్ను మొత్తాన్ని వడ్డీ కలుపుకుంటూ పోతుండగా ఆ మొత్తం రూ.కోట్లలోకి మారింది. ప్రస్తుతం మొత్తం బకాయిలు రూ. 10కోట్లకు పైగా పెరిగాయి. మొత్తం ఏరియర్స్ బకాయిలు రూ. 3.50 కోట్లకు పైగా మాత్రమే ఉంటే వాటికి సంబంధించిన వడ్డీ రూ.6 కోట్లకు పైగా ఉంది. అసలుకన్నా వడ్డీ ఎక్కువగా ఉంది. ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు నిర్వహణ ఖర్చులు, విద్యుత్ చార్జీలు, ఆస్తి పన్ను చెల్లింపు తదితర వాటికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతాయి. కొన్ని శాఖలకు అవి తక్కువగా ఉండటం, నిర్వహణ ఖర్చులు ఎక్కువగా ఉండటంతో ఆస్తి పన్ను చెల్లించడం లేదు. క్రమం తప్పకుండా ప్రభుత్వ శాఖలు ఆస్తి పన్ను చెల్లిస్తే బల్దియాలకు కాస్త ఊరట లభిస్తుంది. ప్రస్తుతం కామారెడ్డి మున్సిపాలిటీ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. కార్మికులకు వేతనాలు చెల్లించే పరిస్థితిలో లేదు. ఈ ప్రభుత్వ శాఖల నుంచి కనీసం 50శాతం అయినా పన్ను వసూలైతే ఇబ్బందులు తొలుగుతాయని బల్దియా అధికారులు ఆశిస్తున్నాయి.



రూ.39లక్షలు బకాయి ఉన్న కామారెడ్డి రైల్వే స్టేషన్

ప్రభుత్వ శాఖల ఆస్తి పన్ను, వడ్డీ వివరాలు

ప్రభుత్వ శాఖ	ఏరియర్స్	వడ్డీ	ప్రస్తుత పన్ను	మొత్తం
ప్రభుత్వ ఆస్పత్రి	1,18,62,003	2,05,52,087	7,76,450	3,31,90,540
రైల్వే స్టేషన్	11,25,064	27,82,706	52,210	39,59,980
మెడికల్ క్వార్టర్స్	9,70,456	17,02,995	62,632	27,36,083
కోర్టు, ఆఫీసర్స్‌క్లబ్	7,91,546	17,23,009	43,458	25,58,013
ఈఈ, పీఆర్	7,73,150	16,83,915	42,536	24,99,601
తహసీల్ ఆఫీస్	6,90,218	17,19,013	39,174	24,48,405
వ్యవసాయశాఖ	10,32,360	12,60,212	98,320	23,90,892
ఆర్డీవో ఆఫీస్	6,66,048	11,94,903	42,506	19,03,457
33/11కేవీ - ఎస్ఎస్2	5,93,506	12,74,001	33,284	19,00,791
పంచాయతీ సమితి	6,80,501	10,00,037	57,852	17,38,390
ఆర్అండ్‌బీ	4,28,941	9,16,881	23,086	13,68,908

ఉన్నతాధికారులకు నివేదించాం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను బకాయిల వసూలు కోసం ఎప్పటికప్పుడు నోటీసులను అందజేస్తున్నాం. ప్రతి ఏటా బకాయిల వివరాలను ఆయా శాఖల ఉన్నతాధికారులతోపాటు, ప్రభుత్వానికి, సీడీఎంఏ, ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. అసలు కన్నా వడ్డీలు ఎక్కువవుతున్నాయి. కనీసం 50శాతం అయినా చెల్లిస్తే పట్టణ అభివృద్ధికి సహకారం ఉంటుంది.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

మాచారెడ్డి/భిక్కనూరు: రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. మాచారెడ్డి, భిక్కనూరు మండలాల్లో గురువారం ఆయన పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లక్ష్మీరావుపల్లి, భిక్కనూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయా చోట్ల షబ్బీర్ మాట్లాడుతూ.. ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భిక్కనూరులో కార్యక్రమం అనంతరం పలువురు స్థానిక విలేకరి గుండెపోటుతో మృతి చెందిన విషయాన్ని షబ్బీర్ దృష్టికి తీసుకెళ్లగా.. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటానని, ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శివప్రసాద్‌కు సూచించారు.

ఆలయ అభివృద్ధికి మరింత కృషి

చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని షబ్బీర్ అలీ అన్నారు. ఆలయ కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయానికి గతంలో రోడ్డు సౌకర్యం కల్పించడంతోపాటు అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించానని గుర్తు చేశారు. మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు తీసుకువస్తానన్నారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు బోరుమోటారును, అలాగే ఆలయ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా కమలాకర్‌రెడ్డి, డైరెక్టర్లుగా యాదవరెడ్డి, రామాగౌడ్, కొత్తకాపు రాజారెడ్డి, లక్ష్మీరాజం, దేవయ్య, బాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, వెంకటరాజేశ్వర్ రావు, అంజయ్య, రాకేశ్‌కుమార్, చింతల నర్సింలు ప్రమాణం చేశారు.



భిక్కనూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న షబ్బీర్

ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నౌసిలాల్‌నాయక్, రమేశ్‌గౌడ్, మోహన్ రెడ్డి, పండ్ల రాజు, సందీప్, శ్రీనివాస్, చందు, సుధాకర్‌రెడ్డి, భిక్కనూర్ విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, నాయకులు ఎడ్ల రాజిరెడ్డి, బల్యాల సుదర్శన్, గాలిరెడ్డి, నర్సింహరెడ్డి, లింబాద్రి, దయాకర్‌రెడ్డి, దుంపల మోహన్‌రెడ్డి, శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జొన్న కొనుగోళ్లు

- 16 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- క్వింటాల్ మద్దతు ధర రూ.3,371
- వెల్లడించిన మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేశ్

సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి క్రైం: 'జొన్న రైతుకేది మద్దతు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. క్వింటాల్‌కు రూ.3,371 మద్దతు ధర చెల్లిస్తూ శుక్రవారం నుంచి జొన్నలు కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మార్కెట్‌లోని దళారులకు తమ పంటను విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, పిట్లం, పుల్కల్, పెద్ద కొడప్‌గల్, చిన్న కొడప్‌గల్, బోర్లం, కారేగాం, గున్‌కుల్, తిమ్మానగర్, గాంధారి, ముదెల్లి, ఆర్గొండ, పద్మాజీవాడి, ఎల్లారెడ్డిలలో కేంద్రాలు ప్రారంభం కానున్నాయని వివరించారు. ఇంకా ఎక్కడైనా కొనుగోలు కేంద్రాలు అవసరమైతే తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. తేమ శాతం 14కు మించకుండా జొన్నలను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

24గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం రైస్‌మిల్లులకు చేరిన 24గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని డీఆర్డీవో సురేందర్ అన్నారు. గురువారం నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే మండలంలోని వదల్‌పర్తి, మాల్తుమ్మెద గేట్, పోచారం, బంజర, ధర్మారెడ్డి గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితారెడ్డితో కలిసి ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులకు రైతులు, ఆయా గ్రామాల పెద్దలు సహకారం అందించాలన్నారు.

ఈ సీజన్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో 183 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల ద్వారా 10 లక్షల 64 వేల 600 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అంచనా వేశామన్నారు. కొనుగోలుకేంద్రాల నిర్వాహణకు సంబంధించి ఇప్పటికే 70శాతం మెటిరీయల్ వచ్చిందని తెలిపారు. 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రూ.802 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆయనవెంట నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, ఐకేపీ ఏపీఎం జగదీశ్‌కుమార్, ఏపీవో సాయిలు, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, ఏఎంసీ మాజీచైర్మన్ వెంకట్రాంరెడ్డి, డైరెక్టర్ నాగేశ్, మాల్తుమ్మెద సొసైటీ మాజీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.



మాల్తుమ్మెదగేట్ వద్ద ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో సురేందర్

● ఒక్క గదిలో ఐదు తరగతులు



ఒకే తరగతి గదిలో ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తుండగా.. కొందరు విద్యార్థులు ముందు వైపు, మరికొందరు విద్యార్థులు వెనుకవైపు ముఖాలు చేసి పాఠాలు వింటున్నారు. ఈ దృశ్యం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనిది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒకే ఒక్క గది ఉండగా, ఇద్దరు టీచర్లు ఉన్నారు. అన్ని తరగతుల విద్యార్థులను ఒకే గదిలో ఒక్కో దిక్కుకు ముఖాలు చేయించి కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. మొత్తం 64 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో ఉన్నారు. గ్రౌండ్ లేకపోవడంతో రోడ్డుపై నిల్చుని ప్రార్థన చేస్తున్నారు.

– కామారెడ్డి రూరల్

హడలెత్తించిన వడగళ్లు



చుక్కాపూర్‌లో వడగళ్ల తాకిడికి రాలిన వడ్లు

బిచ్కుంద/మాచారెడ్డి: వడగళ్ల వాన రైతులను హడలెత్తించింది. జిల్లాలోని బిచ్కుంద, మాచారెడ్డి మండలాల్లో గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులు వీస్తూ వడగళ్ల వాన కురిసింది. బిచ్కుంద మండలం వాజిద్‌నగర్, పుల్కల్, ఫత్లాపూర్, బిచ్కుంద, హజ్గుల్, శెట్లూర్ తదితర గ్రామాల్లో వరి, మొక్కజొన్న, జొన్న పంటలు ఈదురుగాలులకు నేలవాలాయి. జొన్న, వడ్ల గింజలు నల్లగా మారుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంటలు వర్షం కారణంగా దెబ్బతింటున్నాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో వరిపంట దెబ్బతిన్నది. నీరందక ఇప్పటికే వరి ఎండిపోయిందని, మరోవైపు చేతికొచ్చిన పంట అకాల వర్షం కారణంగా దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బిచ్కుందలో కురిసిన వడగళ్లు

ఆబ్కారీకి 'అల్ప్రాజోలం' పరీక్షే!

కల్తీ కల్లు ఘటనలు ఇటీవల జిల్లాలో కలకలం సృష్టించాయి. కల్లు తయారీలో ఏదో ప్రయోగం చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వైద్య నిపుణులు పేర్కొంటుండగా, అది నిర్ధారణ అయ్యేందుకు చాలా సమయం పట్టేవిధంగా ఉంది. కల్తీ కల్లు శాంపిళ్లను పరీక్షించేందుకు అవసరమైన పూర్తిస్థాయి కిట్లు లేకపోవడమే దీనికి కారణం. శాంపిళ్లను హైదరాబాద్‌కు పంపించిన సంబంధిత అధికారులు రిపోర్టుల కోసం వేచిచూస్తున్నారు. కల్తీ కల్లు సేవించిన బాధితులు ఇప్పటికీ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

- రీజినల్ లాబొరేటరీ ఉన్నా పరీక్ష కిట్‌లు లేవంట
- పరీక్షల కోసం శాంపిళ్లను హైదరాబాద్‌లోని ఎఫ్ఎస్ఎల్‌కు పంపాల్సిందే..
- రిపోర్టుల కోసం తప్పని ఎదురుచూపులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కల్తీ కల్లు సేవించి జిల్లాలో వరుసగా 93 మంది అస్వస్థతకు గురైన వ్యవహారం ఆబ్కారీ శాఖ అధికారులకు కునుకులేకుండా చేసింది. బాన్సువాడ, ఎల్లారెడ్డి సర్కిళ్ల పరిధిలో పలువురు అస్వస్థతకు గురికాగా, ఆ రెండు చోట్ల కల్లులో ఎలాంటి మత్తు పదార్థాలు కలిపారనేది తేల్చేందుకు శాంపిళ్లను హైదరాబాద్‌లోని ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. నిజామాబాద్‌లో రీజినల్ లాబొరేటరీ ఉన్నప్పటికీ ఇక్కడ క్లోరో హైడ్రేట్, డైజోఫాంను మాత్రమే నిర్ధారించే అవకాశం ఉందని చెబుతున్నారు. మొదట శాంపిళ్లను సేకరించి నిజామాబాద్ లాబొరేటరీకి పంపించగా, అందులో క్లోరోహైడ్రేట్, డైజోఫాం లేదని వెల్లడికావడంతో అల్ప్రాజోలం కలిపి ఉంటారని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వెంటనే శాంపిళ్లను హైదరాబాద్‌లోని ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. దుర్కి నుంచి రెండు, అంకోల్, దామరంచ గ్రామాల నుంచి ఒక్కోటి, అలాగే అనుమతి లేని మరో దుకాణం నుంచి ఒకటి ఇలా మొత్తం ఐదు శాంపిళ్లను సేకరించి పరీక్షల కోసం హైదరాబాద్‌కు పంపించినట్టు ఎక్సైజ్ అధికారులు వివరించారు. నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు సంబంధించి నిజామాబాద్‌లో లాబొరేటరీ ఉంది. అయితే ఇక్కడ క్లోరోహైడ్రేట్, డైజోఫాంలను నిర్ధారించే వరకే సౌకర్యం ఉందని, అల్ప్రాజోలంను నిర్ధారించేందుకు అవసరమైన కిట్లు, సౌకర్యాలు లేవని ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. కల్తీకల్లు అమ్మకాలపై ఫిర్యాదులు వచ్చినపుడు దాడులు నిర్వహించి శాంపిల్స్ సేకరించి రీజినల్ లాబొరేటరీకి పంపిస్తారు. రిపోర్టులు వచ్చేది ఎప్పుడో కూడా పెద్దగా పట్టించుకోరు. అయితే కల్తీకల్లుతో పలువురు అస్వస్థతకు గురైన ఘటనలతో తప్పనిసరిగా శాంపిళ్లను సేకరించి అవసరమైన పరీక్షలు నిర్వహించి కల్లులో కలిసిన మత్తు పదార్థాల సంగతి తేల్చాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అయితే జిల్లా నుంచి ఐదు శాంపిళ్లను ఎఫ్ఎస్ఎల్‌కు పంపిన అధికారులు రిపోర్టుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. అక్కడ వరుస క్రమంలో పరీక్షలు జరిపి రిపోర్టులు ఇస్తారు. రిపోర్టులు చేతికందిన తరువాతే కేసులో సెక్షన్లు ఏమైనా చేర్చాల్సి చేయాల్సి ఉంటుందా లేదా అనేదానిపై స్పష్టత వస్తుంది. ఉమ్మడి జిల్లాలో అల్ప్రాజోలం సరఫరా చేస్తూ పలువురు చిక్కిన ఘటనలతోపాటు వరుసగా కల్తీ కల్లు ఘటనలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో కల్తీ నిర్ధారణకు అవసరమైన కిట్లు ఇక్కడే ఉంచితే త్వరగా పరీక్షలు జరిపి నిర్ధారించే వీలుంటుంది. ఎక్సైజ్ అధికారులు దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.



కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో కల్తీకల్లు బాధితురాలితో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ సోమిరెడ్డి

కోలుకుంటున్న బాధితులు

జిల్లాలో ఇటీవల కల్తీకల్లు తాగి అస్వస్థతకు గురైన వారిలో 27 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగతా వారు కోలుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ హన్మంతరావు తెలిపారు. మొత్తం 92 మంది అస్వస్థతకు గురయ్యారని, కల్తీ కల్లు తయారీ, అమ్మకాలకు సంబంధించి ఆరు ఘటనల్లో 27 మందిపై కేసులు నమోదు చేసి ఇప్పటికే నలుగురిని అరెస్టు చేసినట్లు వివరించారు. మిగతా 23 మందిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. 18 టీఎఫ్‌టీ లైసెన్సులు రద్దు చేశామని తెలిపారు. కృత్రిమ కల్లు తాగొద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

బాధితులను పరామర్శించిన డిప్యూటీ కమిషనర్

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్తీ కల్లు బాధితులను ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి గురువారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంతరావ్, అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

బిచ్కుంద ఆస్పత్రికి ఇద్దరు కొత్త వైద్యులు

బిచ్కుంద: మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిలో ఉన్నతాధికారులు కొత్తగా ఇద్దరు డాక్టర్లను నియమించారు. గైకాలజిస్టుగా డాక్టర్ పిట్లివార్ స్వప్నాలి, ఆర్థోపెడిక్ డాక్టర్‌గా రాకేశ్ విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. మొత్తం నలుగురు వైద్యులు ఆస్పత్రిలో ఉన్నారని సూపరింటెండెంట్ కాళిదాస్ తెలిపారు. గైనకాలజిస్టు వైద్యురాలు రావడంతో ఎ మ్మెల్యే లక్ష్మీకాంతారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

వంద శాతం పన్ను వసూలు

బిచ్కుంద: జిల్లా అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్ను వసూలు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని డీపీవో మురళి అన్నారు. ఇప్పటి వరకు 99 శాతం పన్ను వసూలైందన్నారు. బిచ్కుంద గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. మిషన్ భగీరథ మంచినీళ్లు పచ్చగా రంగు మారి వస్తున్నాయని డీపీవో దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ జీపీ సిబ్బంది ఉన్నారు.

అధికారం కోసం బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలి

కామారెడ్డి టౌన్ : తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రభారి గడ్డం శ్రీనివాస్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 11, 12, 13 తేదీలలో జరిగే 'గావ్ చలో – బస్తీ చలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలలో, పట్టణంలోని అన్ని వార్డుల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి, నాయకులు వేణు, వెంకట్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు పడిగాపులు



ధాన్యం బస్తాలపై కాపలా కాస్తున్న రైతు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని బొప్పాస్‌పల్లిలో రోడ్డు వద్ద ధాన్యం బస్తాలకు ఫకీరా నాయక్ తండాకు చెందిన రైతు పాండు కాపలా కాస్తున్నాడు. ధాన్యం మేచర్ రావడంతో మైలారం పీఏసీఎస్‌కి చెందిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించాడు. లారీల కొరతతో సగం ధాన్యం బస్తాలు తీసుకెళ్లారని మిగితావి ఎప్పుడూ తీసుకెళ్తారో తెలియడంలేదని, అకాల వర్షాల కారణంగా ధాన్యం బస్తాలు తడిచిపోతున్నాయని రైతు వాపోయాడు.

మెరుగైన సేవలు అందించాలి

కామారెడ్డి క్రైం: ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. పోలీస్ స్టేషన్‌ల రైటర్లకు నూతన చట్టాలపై జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహనా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఎఫ్ఐఆర్ మొదలుకొని చార్జిషీట్ దాఖలు, సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడం తదితర అన్ని రకాల కోర్టు వ్యవహారాలను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఫిర్యాదుదారులకు కేసులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్లాక్ స్పాట్‌ల పరిశీలన

జిల్లాలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న గుర్తించిన బ్లాక్ స్పాట్‌లను ఎస్పీ రాజేశ్‌చంద్ర పరిశీలించారు. స్పీడ్ గన్‌ల పనితీరును, జరిమానాల గురించి తెలుసుకుని సిబ్బందికి సూచనలు చేశారు. ఎస్పీ వెంట కామారెడ్డి రూరల్, భిక్కనూర్, సదాశివనగర్ సీఐలు రామన్, సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



పొందుర్తి వద్ద బ్లాక్ స్పాట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

అభివృద్ధి పనుల పరిశీలన



ముస్తాపూర్‌లో చేపల చెరువు తవ్వకం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్, లింగంపేట గ్రామాల్లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం పర్యటించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా ముస్తాపూర్ శివారులో చేపడుతున్న చేపల చెరువు పనులతోపాటు లింగంపేట గ్రామంలో అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ముస్తాపూర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు, రేషన్ కార్డుల లబ్ధిదారుల సర్వేలో టెక్నికల్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే లింగంపేట నాగన్నగారి మెట్ల బావి పూడికతీత పనులను పరిశీలించిన కలెక్టర్.. ఉపాధి హామీలో భాగంగా పనులను చేపట్టాలని ఆదేశించారు. డీఆర్డీవో సురేందర్, ఆర్డీవో ప్రభాకర్, ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్హారి, ఏపీఎం శ్రీనివాస్, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, కార్యదర్శులు ఉన్నారు.

కొనసాగుతున్న వేసవి కాల ప్రత్యేక శిబిరం



దోమకొండలోని గడికోట ఉపగడ్డ వద్ద శ్రమదానం చేస్తున్న వలంటీర్లు

దోమకొండ: తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో చేపట్టిన వేసవికాల ప్రత్యేక శిబిరం గురువారం నాలుగో రోజు కొనసాగింది. శిబిరంలో భాగంగా వలంటీర్లు దోమకొండ లోని బస్టాండ్ ఆవరణంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తూ ర్యాలీ తీశారు. గడికోట పడమర ద్వారానికి ఎదురుగా ఉన్న ఉపగడ్డను పరిరక్షించడానికి వలంటీర్స్ శ్రమదానం చేయడం చేశారు. గ్రామంలో నైపుణ్యాలపైన సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బాబ్జి, ప్రోగ్రాం ఆఫీసర్స్ అంజయ్య, డాక్టర్ శ్రీ హరిత ,ట్రస్టు కోఆర్డినేటర్ నేతుల గణేష్ యాదవ్, వలంటీర్లు పాల్గొన్నారు.

హాజీపూర్‌లో ఎన్ఎస్ఎస్ క్యాంపు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో భాగంగా గ్రామంలోని యువకులకు విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ చంద్రకాంత్ తదితరులున్నారు.

పారిశుధ్యం లోపించకుండా చూడాలి



బస్టాండ్‌లో మురికిని పరిశీలిస్తున్న డీపీవో మురళి

సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద: మండల కేంద్రం, గ్రామాల్లో ఎక్కడ పారిశుధ్యం లోపించకుండా కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలని డీపీవో మురళి అన్నారు. గురువారం ‘సాక్షి’లో మురికికూపంగా బస్టాండ్ శీర్షికన ప్రచురితమైన కథనానికి డీపీవో మురళి, ప్రత్యేక అధికారి, తహసీల్దార్ వేణుగోపాల్ స్పందించారు. డీపీవో మురళి ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండ్‌లో మురికిని వెంటనే తొలగించాలని కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌ను డీపీవో ఆదేశించారు. సీసీరోడ్డు కంటే మురికి కాలువ ఎత్తులో ఉండటంతో మురికి నీరు బయటకు వెళ్లడం లేదన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిర్మించిన మురికి కాలువ ఉపయోగం లేకుండా పోయిందన్నారు. మొరం వేసి సీసీ రోడ్డు ఎత్తు పెంచాలని సూచించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



చిన్న దేవిసింగ్ తండాలో మురుగునీరును శుభ్రం చేయిస్తున్న అధికారులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండంలోని చిన్న దేవిసింగ్ తండాలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి మండల అధికారులు స్పందించారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి చిన్న దేవిసాంగ్ తండాను సందర్శించి మురుగునీరును తొలగింపజేశారు. దుర్గంధం రాకుండా మొరం పోయించారు. గ్రామల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శలకు ఎంపీడీవో సూచించారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తాం

సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎరుకల నారాయణ

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యుత్ వినియోగదారులు, రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గాంధారి మండలం సర్వాపూర్, లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి, మెంగారం, మోతె, నల్లమడుగు, బాణాపూర్, పర్మళ్ల గ్రామాల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ సిబ్బందికి సూచించారు. సిబ్బంది గ్రామాల్లో వినియోగదారులకు అందుబాటులో ఉండాలన్నారు. పరిష్కార వేదికలో లూజ్ లైన్, ఓవర్ లోడ్, ట్రాన్స్ ఫార్మర్లు, బిల్లుల సమస్యలపై 12 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. వాటికి సంబంధించిన పోల్స్, పరికరాలు సిద్ధం చేసి 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్రావణ్‌కుమార్, డీఈఈ విజయసారథి, ఏడీఈ మల్లేశం, ఏఈలు సాయినాథ్, హరీష్‌రావు, లక్ష్మన్, నాలుగు సెక్షన్‌ల పరిధిలోని ట్రాన్స్‌కో సబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎరుకల నారాయణ

‘సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీ ఉద్యమం’

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి వినతి పత్రం
- ఉద్యోగ జేఏసీ అల్టిమేటం

కామారెడ్డి అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంప్లాయిస్ జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని జేఏసీ జిల్లా చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి, సెక్రెటరి జనరల్ ఆర్.దేవేందర్‌ల ఆధ్వర్యంలో 27 సంఘాల ప్రతినిధులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతు.. జిల్లాలోని ఎమ్మెల్యేలందరితో పాటు ప్రజాప్రతినిధులకు జేఏసీ వినతి పత్రాలు అందజేస్తుందని, తమ దశల వారీ ఉద్యమానికి మద్దతు కోరుతాన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు ఏ.కుషాల్, ఆకులబాబు, ప్రేమ్‌కుమార్, నాగరాజు, సాయి రెడ్డి, ఎల్లారెడ్డి, హన్మంత్‌రెడ్డి, బి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు కొత్త రేషన్‌కార్డులు అందిస్తాం

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 92 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

వందశాతం ఇంటిపన్ను వసూలు చేయాలి

ఎల్లారెడ్డి: ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వార్డుల వారీగా నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్, సిబ్బంది తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం ఆయన లింగంపేట మండలం ఎల్లారం గ్రామంలో మార్కౌట్ చేసిన ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు.ఎల్లారం గ్రామానికి 45 ఇళ్లు మంజూరు కాగా, 12 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, కార్యదర్శి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చందర్‌నాయక్

కొనుగోలు కేంద్రం పరిశీలన

నస్రుల్లాబాద్: మండలంలోని అంకోల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చందర్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీవో సూర్యకాంత్, ఐకేపీ ఏపీఎం గంగాధర్, రైతులు ఉన్నారు.

క్రైం కార్నర్

చోరీకి పాల్పడిన మహిళ పట్టివేత

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజివాడిలో చోరీకి పాల్పడిన మహిళను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సదాశినగర్‌కు చెందిన శిరీష అనే మహిళ గురువారం ఉదయం కృష్ణాజీవాడి గ్రా మానికి వచ్చి గ్రామంలో తిరుగుతూ రాంరెడ్డికి చెందిన తాళం వేసిన ఇంట్లోకి చొరబడి 20 తులాల వెండి పట్టగొలుసులు, రోల్డ్‌గోల్డ్ చైన్లను దొంగతనం చేసింది. అనంతరం ఒక వృద్ధురాలి దగ్గరకు వచ్చి, మాయమాటలు చెబుతూ బంగారం గెంటీలు తీయబోయింది. ఆమె కేకలు వేయడంతో పారిపోయేందుకు యత్నించగా గ్రామస్తులు పట్టుకున్నారు. పోలీసులు గ్రామానికి వచ్చి మహిళను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కుంటలో పడి ఇద్దరు బాలురు మృతి

- కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాలో చోటుచేసుకున్న ఘటన



తెజావత్ సాయి కుమార్ (ఫైల్)



భుక్యా సురేష్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: ఇద్దరు బాలురు సరదాగా స్నానం చేసేందుకు వెళ్లి కుంటలో మునిగి మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా క్యాసంపల్లి తండా కు చెందిన తెజావత్ సాయి కుమార్ (16), భుక్యా సురేష్ (15) చదువు మానేసి కొద్ది రోజులుగా దోమకొండ మండలం ముత్యంపేట గ్రామంలోని ఓ కల్లు దుకాణంలో పని చేస్తున్నారు. వారిద్దరూ మంగళవారం సాయంత్రం వరకు కల్లు దుకాణంలో పనులు చేసి బయటకు వెళ్లినట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం వారిద్దరి మృతదేహాలు సమీపంలో ఉండే రాఘవాపూర్ గ్రామ శివారు లోని ఓ కుంటలో తేలాయి. సమాచారం తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున కుంట వద్దకు చేరుకున్నారు. దేవునిపల్లి పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. ఎస్సై రాజు విచారణ జరిపి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి బట్టలు గట్టుపై ఉండటంతో వారిద్దరూ స్నానం చేయడానికి కుంటలోకి దిగి ఉంటారని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సు కింద పడి వృద్ధురాలు మృతి

కామారెడ్డి క్రైమ్: సదాశివనగర్ మండలంలోని జనగాం గ్రామంలో ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కింద పడడంతో తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జనగాం గ్రామానికి చెందిన పసుపుల లింగవ్వ(75) ఇటీవల లింగంపల్లికి వెళ్లగా తిరిగి సొంతూరు రావడానికి గురువారం ఆర్టీసీ బస్సు ఎక్కింది. జనగాంలో ఆమె బస్సు దిగుతుండగా ఈ విషయాన్ని కండక్టర్, డ్రైవర్ గమనించలేదు. దీంతో బస్సు ముందుకు వెళుతుండగా ఆమె అదుపుతప్పి కిందపడంతో బస్సు వెనక టైరు కాళ్ల పైనుంచి వెళ్లింది. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

ఒకరికి ఐదేళ్ల జైలుశిక్ష

కామారెడ్డి క్రైం/నిజాంసాగర్: బాలికపై లైంగిక దాడి (పోక్సో)కి పాల్పడిన కేసులో నేరస్తుడికి కామారెడ్డి కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలు ఇలా.. నిజాంసాగర్ మండలం బూర్గుల్ గ్రామానికి చెందిన షేక్ షాదుల్ అనే వ్యక్తి 2021 జనవరి 16న ఇంటి బయట ఆడుకుంటున్న ఆరేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు పంపారు. కోర్టులో మొదటి అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ విచారణ చేపట్టగా నేరం రుజువైంది. దీంతో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ జడ్జి గురువారం తీర్పు వెల్లడించారు.

కల్లుదుకాణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి



ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట్ గ్రామంలో అనుమతి లేకుండా కల్లు విక్రయిస్తున్న దుకాణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. అర్సపల్లి గ్రామానికి చెందిన అమర శ్రీనివాస్‌గౌడ్ లైసెన్స్ లేకుండా కల్లు విక్రయించడంతో కేసు నమోదు చేసి బోధన్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.దుకాణంలో నిల్వ ఉన్న 350 లీటర్ల కల్లును అధికారులు పా రబోసారు.సీఐ స్వప్న,హెడ్ కానిస్టేబుల్ రాజన్న, కానిస్టేబుళ్లు హమీద్, ఉత్తం, శ్యామ్, ఆశన్న పాల్గొన్నారు.

కల్తీ కల్లు అమ్మినందుకు ఒకరి రిమాండ్

బాన్సువాడ: బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామంలో కల్తీ కల్లు తాగి పలువురు అస్వస్థతకు గురికావడంతో కల్లు అమ్మిన ఒకరిని రిమాండ్ చేసినట్లు సీఐ రాజేష్ గురువారం తెలిపారు. దుర్కి గ్రామానికి చెందిన లకోష్మగౌడ్, సురేందర్‌గౌడ్‌ల దగ్గర నుంచి కల్లు కొనుగోలు చేసి అమ్మినందుకు దామరంచ గ్రామానికి చెందిన గంగాధర్‌గౌడ్‌ను రిమాండ్ పంపించామన్నారు. సిబ్బంది సిబ్బంది శ్రీనివాస్,సంగమేశ్వర్ ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బోండ్ల నర్సింలు (35) మద్యానికి బానిసై గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

భిక్కనూరు మండలంలో..

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పోచమ్మల నర్సింలు (45) కుటుంబ కలహాలతో విరక్తి చెందాడు. ఈక్రమంలో గురువారం వేకువజామున అతడు తన బంగ్లా పైనుంచి విద్యుత్తు స్తంభం ఎక్కి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడతోఘటనా స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.



ఆత్మహత్య చేసుకున్న నర్సింలు

బాలుడి ఆత్మహత్యాయత్నం

రాజంపేట: మండల కేంద్రంలో ఓ బాలుడు ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. రాజంపేటకు చెందిన కడమంచి స్వామి కుమారుడు శ్రీహరి(17) రూ. 30వేల మొబైల్ ఫోన్ కొనివ్వాలని ఇంట్లో గొడవ పడ్డాడు. అంత ఖరీదైన మొబైల్ కొనే స్తోమత లేదంటూ తండ్రి నిరాకరించాడు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీహరి గురువారం ఎలుకల మందు(బిస్కెట్లు) తిన్నాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలపడంతో వారు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీహరి ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

కాలువలో వడ్ల లారీ బోల్తా .. తడిసిన బస్తాలు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని బొప్పాస్‌పల్లి గ్రామ సమీపంలో గల నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటర్ 26కు చెందిన ఉపకాలువలో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. బైరాపూర్ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో కాంట పెట్టిన ధాన్యాన్ని రైస్ మిల్లుకు తీసుకుని వెళ్తుండగా గురువారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. లారీలో బొప్పాస్ పల్లి గ్రామానికి రైతులవి 796 బస్తాలు ఉన్నాయి.వారం రోజుల పాటు ఎండ బెట్టిన ధాన్యం మళ్లీ తడిసిపోవడంతో రైస్ మిల్లు వారు తిరిగి పంపిస్తారని రైతులు ఆవేదన చెందుతున్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

చెరువులో చేపల మృత్యువాత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వదల్‌పర్తి గ్రామశివారులో గల చెరువులో చేపలు మృత్యువాత పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఇటీవల పెరిగిన ఎండల తీవ్రతతో చేపలు మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. చెరువులో ప్రస్తుతం సుమారు 5వేల చేపలు మృత్యువాత పడినట్లు వారు పేర్కొన్నారు.

అత్త భూమికి కోడలు ఎసరు !

- తనకు బదులు మరొకరిని తీసుకెళ్లి రిజిస్ట్రేషన్
- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



బాధితురాలు పుష్పలత

మాచారెడ్డి : అత్త పేరిట ఉన్న 24 గుంటల భూమిని కాజేసేందుకు కోడలు ప్లాన్ వేసి అమలు చేసింది. అత్తకు బదులు మరో మహిళను తీసుకువెళ్లి భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఈ ఘటన పాల్వంచ మండలం మంథని దేవునిపల్లిలో జరిగింది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దేవునిపల్లికి చెందిన మంత పుష్పలత పేరుపై 24గుంటల పట్టా భూమి ఉంది. ఆ భూమిని తనపేరుపై చేసుకోవాలనుకున్న ఆమె కోడలు విజయ ఈనెల 8వ తేదీన మరో మహిళను పాల్వంచ తహసీల్ కార్యాలయానికి తీసుకెళ్లి ఆమెనే పుష్పలతగా నమ్మించింది. సర్వేనంబరు 299/1లో ఉన్న 7 గుంటలు, 330/2లో ఉన్న 9 గుంటలు, 74/2లో ఉన్న మరో 8 గుంటలు మొత్తం 24 గుంటల భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంది. తహసీల్ కార్యాలయానికి విజయ తీసుకెళ్లిన మహిళ వేలిముద్రలు రాకపోవడంతో పుష్పలత ఫోన్‌కు ఓటీపీ పంపించి, తన కూతురు ద్వారా ఓటీపీ తీసుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియను విజయ కానిచ్చింది. ఈ విషయం తెలిసిన పుష్పలత కోడలు తనను మోసం చేసిందంటూ పోలీసులను ఆశ్రయించింది. ఈ విషయమై పాల్వంచ తహసీల్దార్ హిమబిందును వివరణ కోరగా.. ధరణి పోర్టల్ ద్వారా పుష్పలత ఫోన్ నంబరుకు ఓటీపీ వెళ్లడంతో నంబర్ చెప్పారని తహసీల్దార్ వివరణ ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అనిల్ తెలిపారు.

కిడ్నాపైన బాలిక తల్లికి అప్పగింత

ఖలీల్‌వాడి: నగరంలో ఈనెల 6న కిడ్నాప్‌కు గురైన రమ్య(3) అనే బాలికను తల్లికి అప్పగించినట్లు ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తెలిపారు. నగరంలోని ఒకటోటౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. గాంధారి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన శిరీష నగరంలోని నాగారంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈనెల 6న ఆమె మూడేళ్ల కూతురు రమ్యను తల్లి కొండవ్వ వద్ద వదిలేసి, 8నెలలు కుమారు దశరథ్‌ను తీసుకుని భిక్షాటనకు వెళ్లింది. గాంధీచౌక్ వద్ద అదేరోజు రాత్రి కొండవ్వ, రమ్య నిద్రించగా మద్నూర్ మండలంలోని మీర్జాపూర్ గ్రామానికి చెందిన గైక్వాడ్ బాలాజీ బాలికను కిడ్నాప్ చేసి, సోదరుడైన గైక్వాడ్ సూర్యకాంతంకు అప్పగించాడు. వారు బాలికను అమ్మి డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఒకటో టౌన్ సీఐ రఘుపతి ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టగా నిందితుడు సూర్యకాంతంను అదుపులోకి తీసున్నామన్నారు. అలాగే బాలికను తల్లికి అప్పగించినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు బాలాజీ పరారీలో ఉన్నట్లు తెలిపారు. బాలాజీపై ఇదివరకు బోధన్ పోలీస్ స్టేషన్‌లో మర్డర్ కేసు, అలాగే బిచ్కుందలో చోరీ కేసులు ఉన్నాయన్నారు. కేసును ఛేధించిన సీఐ రఘుపతి, ఏఎస్ఐ షకీల్, కానిస్టేబుళ్లను అభినందించారు.